## జమ్ముకశ్మీర్‌రోడ్డు ప్రమాదంలో

## సిఆర్పిఎఫ్ జవాన్ మృతి

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

నివాలు అర్పించిన ప్రజాప్రతినిధులు



4


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 14 మే, 2026 | పేజీలు : 08


# విద్యాభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా వర్ధన్నపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించే వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా ఐఏఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది అని, ప్రతి గ్రామంలో విద్యా వికాసం జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం చాలా అవసరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానిక సంస్థలు కలిసి పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు.ప్రతి గ్రామంలో పాఠశాలల పరిస్థితిని సర్పంచులు తరచూ పరిశీలించాలని, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా పాఠశాలల పట్ల సమాజ బాధ్యతను కూడా పెంచుతున్నాయని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామస్థాయి అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోందని, ప్రతి శాఖ ప్రజలకు చేరువయ్యేలా ప్రత్యేక కార్యాచరణలు చేపడుతోందన్నారు. విద్యా రంగంలో తీసుకొస్తున్న మార్పులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల కుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి రాజేందర్, వర్ధన్నపేట ఫ్యాక్స్ చైర్మన్ రాజేష్ ఖన్నా, మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య,కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లికీమా నాయక్, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి కుమారస్వామి, సర్పంచులు, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఆర్డీఓ సుమ, ఎంపీడీవో, ఎంఈఓ ప్రజాప్రతినిధులు, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బాలికల విద్యతోనే..

## కుటుంబం,దేశం అభివృద్ధి

**విద్యా వారోత్సవాల్లో ఎంపి కడియం కావ్య**



**ప్రజాపక్షం/జనగామ :** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో సమాజం భాగస్వామ్యం కావాలని వరంగల్ ఎంపి కడియం కావ్య కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మట్టిలో మాణిక్యాలు తీర్చిదిద్దబడుతున్నారని, బాలికల విద్యతోనే కుటుంబం, దేశం అభివృద్ధి అనే విషయాన్ని మరిచి పోవద్దు అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా స్టేషన్‌ఘనపూర్, జనగామ నియోజకవర్గాల్లో నియోజకవర్గ స్థాయి సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు విద్యపై అవగాహన సదస్సు నిర్వయించారు. స్టేషన్‌ఘనపూర్‌లో జరిగిన విద్యా సదస్సుకు కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేస్తుందని, ప్రజా ప్రతినిధులు గుడిని ఎలా చూసుకుంటారో బడిని అలాగే బాధ్యతగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎన్నో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిలో ప్రస్తుత సర్పంచ్, కౌన్సిలర్లు కూడా ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దబడుతున్నారన్నారు.

2

## కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీట

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**

**ప్రజాపక్షం/రామాయంపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీట వేసిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో బాగంగా విద్యావారోత్సవాల సందర్భంగా బుధవారం మున్సిపాలిటి పరిదిలోని కస్తూర్బా గాందీ బాలికల పాఠశాలలో 30లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఈప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్మెన్ పోచమ్మల నవనీత గణేష్, మండల విద్యాదికారి శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ అనురాధ, ఏఈ అరవింద్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మూడు లక్షలకు

# ఆడశిశువు విక్రయం

**తల్లిదండ్రులు, మధ్యవర్తులపై కేసు నమోదు**

**అక్రమ దత్తతలకు పాల్పడితే కఠిన చర్యలు**

**జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి హెచ్చరిక**



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో శిశు విక్రయాలు, అక్రమ దత్తతలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి హెచ్చరించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతిరెడ్డి పల్లి తాండకు చెందిన ఓ దంపతులు తమ నాలుగో సంతానమైన ఆడశిశువును రూ. 3 లక్షలకు విక్రయించిన ఘటన వెలుగులోకి రావడంతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో, సంబంధిత దంపతులకు ఇప్పటికే ముగ్గురు సంతానం ఉండగా, ఈ ఏడాది మార్చి 27 న మెదక్ లోని ఎంసీహెచ్ ఆసుపత్రిలో ఆడపాప జన్మించినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం కొంతమంది మధ్యవర్తుల సహకారంతో ఆ శిశువును ములుగు మండలం అల్లినగర్‌కు చెందిన దంపతులకు రూ.3 లక్షలకు విక్రయించినట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ విషయమై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం శిశువును తిరిగి స్వాధీనం చేసుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు ఆ పాపను సంగారెడ్డి శిశుగృహానికి తరలించి సంరక్షణ కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి జిల్లా బాలల పరిరక్షణ విభాగాన్ని సంప్రదించి అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని హేమ భార్గవి సూచించారు. అక్రమ మార్గాల్లో దత్తతలు, శిశు విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నీట్ పేరుతో లక్షలాది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడడం దుర్మార్గం

బికెయంయు జాతీయ

కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం నీట్ పేరుతో 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం దుర్మార్గమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని, ఎన్‌టిఏను రద్దు చేయాలని, ఈ సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు గురై కష్టపడి చదివిన విద్యార్థులకు నిరాశే మిగిలిందన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులు కార్మికులు సాధారణ ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పోసప్పో చేసి డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్ సెంటర్లకు పంపించి చదివిస్తే ప్రశ్నాపత్రం లీకై పరీక్షలు రద్దు కావడం మానసిక వేదనకు గురిచేశాయన్నారు. మళ్లీ పరీక్షలు రాయడానికి విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుందని, కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. గతంలో అనేకసార్లు లీకేజీలు జరిగిన తగిన గుణపాఠాలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైనందుననే మళ్లీ మళ్లీ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్రమైన న్యాయ విచారణ జరిపించి దోషులు ఎంతటి వారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రశ్నాపత్రాలు లీకులు లేకుండ ఉండేందుకు గాను నిపుణులు సూచించిన విధంగా ఆన్ లైన్ విధానంలో ఒకేసారి పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు


## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన గోడౌన్లకు తరలించాలని సూచించారు.



రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని అన్నారు. అనంతరం జంబావ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆర్‌డిఓ సుమా, జడ్పి సిఈఓ రామ్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయి డిఎం కిష్టయ్య, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపిడిఓ కిషన్,లు పాల్గొన్నారు.

## పలు వివాహాలకు హాజరైన ఎర్రబెల్లి



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని పలు వివాహాలకు బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ మండల పార్టీ యూత్ నాయకులు సంకినేని ఎల్లస్వామి...ఉమా, అదే గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు గాడిపెల్లి రాములు కూతురు ప్రత్యూష రాజవింద్, గట్టికల్ గ్రామానికి చెందిన చిర్ర యాక సాయిలు కూతురు ఇంద్రజ నవీన్, మొరిపిరాల గ్రామానికి చెందిన వేల్పుల వెంకన్న కూతురు అను ప్రణయ్, కొండూరు గ్రామానికి చెందిన రంజిత్ రచనల వివాహా వేడుకలలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, ఐత రాంచందర్, చిలువేరు సాయి, కర్ర రవీందర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, బద్దం వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన లేబర్ కోడ్స్ రూల్స్ పత్రాల దహనం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** పాత చట్టాలను అమలు చేయాలని ఏఐటియూసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ అమలు కోసం నూతన రూల్స్ చేయడం జరిగింది. రూల్స్‌కు వ్యతిరేకంగా ఏఐటియూసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుమస్తాల సంఘం పక్షాన హంటర్ రోడ్డులో రూల్స్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నర్ర ప్రతాప్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉప సంహకరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. 100 సంవత్సరాల క్రితం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిన బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లను అమలుకు తెస్తున్నారు. 12గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారు. సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తుందని, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం బరితెగించిందని రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటిని తుంగలోకి తొక్కి కార్మికులుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేసే విధంగా ప్రయత్నం సాగిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గానికి చాలా అవసరం ఉందన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం పెద్దకొర్పోల్ గ్రామంలో బిఆర్‌ఎస్ నాయకులు కీర్తి నిత్యానందం పద్మ దంపతుల కుమారుడు రవితేజ వివాహం సాయిశ్రీతో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన దపంతులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, మొకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు కారింగుల సురేష్ గౌడ్, పొడిశెట్టి సత్యం, పెద్దకోరుపోలు మాజీ సర్పంచ్ పాషా, ఉప సర్పంచ్ మమతరాజా, మహేంద్రతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహా వేడుకలో కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం అప్పలరావుపేట గ్రామం శుభకార్య సందడితో కళకళలాడింది. గ్రామానికి చెందిన కదిరే స్రవంతి..సురేష్ దంపతుల కుమార్తె హాసిని వివాహం రఘుతో ఘనంగా నిర్వహించగా, ఈ వేడుకకు టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహా మండపానికి చేరుకున్న రంజిత్ రెడ్డికి స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వధూవరులకు అక్షింతలు వేసి వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలు, సాంప్రదాయాలు నిలబెట్టే వేడుకలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అ ధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, మండలాధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, కోశాధికారి కెవి సుబ్బారెడ్డి, ఏజిపి బండి శివకుమార్, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, చల్లా శ్రీపాల్ రెడ్డి, చల్లా పాపిరెడ్డి, గరికపాటి కృష్ణారావు, అప్పలరావుపేట సర్పంచ్ ఉడుగుల అశోక్, సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు కొయ్యడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదా ఘాతంతో ఎద్దు మృతి

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని ఊకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీ తండాలోని మర్రి తండాలో బుధవారం విద్యుత్ ఘాతంతో ఎద్దు మృతి చెందింది. మర్రి తండాకు చెందిన రైతు బానోత్ వెంకన్న తన దుక్కిటెద్దులను మేత కోసం పొలం వద్ద విడిచి వెళ్ళాడు. మేత మేసుకుంటూ ఒక ఎద్దు అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్ళి విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ సుమారు ఒక లక్ష రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.



## బాలికల విద్యతోనే.. కుటుంబం,దేశం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ప్రైయివేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లోనే ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు 120 మందికి 550కి పైగా మార్కులు వస్తే సన్మానించుకోవడం జరిగిందన్నారు. చదువు ద్వారా పేద విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. పాఠశాలలకు అవసరమైన వసతులు కల్పించేందుకు అందరు కలిసి కృషి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వయిస్తూ ప్రభుత్వ బడులపై తల్లి దండ్రుల్లో మరింత నమ్మకాన్ని పెంచి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చూడాలన్నారు. బడి సామాజాన్ని తయారు చేస్తుందని భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దుతుందన్నారు. ఉపాధ్యాయులను పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారని డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్లుగా విద్యనే చీకటి నుండి వెలుగులు తెప్పిస్తుందన్నారు. ఇంట్లో ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా ప్రతినిధులకు నెలకు ఒకసారైనా పాఠశాలలు సందర్శించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తుందన్నారు. సమ్మర్ క్యాంప్‌లు నిర్వయిస్తున్నారని, పేరెంట్‌టీచర్ మీటింగ్‌లు నిర్వయించి విద్యార్థుల బాధ్యతను గుర్తు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వినయ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, నియోజకవర్గ ఎంఇఓలు, కౌన్సిలర్లు, ప్రజాప్రతిధులు పాల్గొన్నారు.

## జిల్లా యంత్రాంగ చర్యలను ధృవీకరించిన హై కోర్టు

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా కలెక్టరేట్ ఎంట్రీ, ఎగ్జిట్, పోటోకాల్, టీ స్టాల్ మార్పు వంటి వాటి విషయంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను హై కోర్టు ధృవీకరించిందని జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి పల్లవి తెలిపారు. బుధవారం దీనికి సంబందించి ఒక ప్రకటన విడుదల చేశారు. వార్త పత్రికల్లో వచ్చిన ప్రచురణలకు సంబందించి కోర్టు ఇచ్చిన, అధికారులు తెలిపిన అంశాలు కొన్నింటిని ప్రతిపాధించారు. టీ స్టాల్ తొలగింపు విషయంలో హై కోర్టు తాత్కాలిక స్థలం చూపించాలని కోరిన నేపద్యంలో 17వ వార్డులోని మార్కెట్ సమీపంలో ప్రత్యామ్నాయ స్థలం చూపించడం జరిగిందన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్ ప్రోటోకాల్‌కు సంబంధించి నమోదైన సంఘటనలకు సంబందించి మార్చి 22వ తేదీని ఆదివారం రోజున భూ సేకరణ, రికార్డుల కార్యాలయంలో హోదా లేని వారు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి ఉప విభజన రికార్డులను కలర్ ప్రింట్స తీస్తు కనిపించగా షోకాజ్ నోటీసులు ఇవ్వడం, ఆర్‌డిఓ విచారణతో ప్రైయివేట్ వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టడం జరిగిందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ వాహన పార్కింగ్ స్థలంలో అనాధికారికంగా 80 క్లెయిమ్ చేయని వాహనాలు కొన్ని సంవత్సరాలుగా నిలిచి ఉన్నాయని, ఆస్తి సీజ్ వాహనాలు సైతం ఇక్కడే పార్కింగ్ చేసిన పరిస్థిత ఉందన్నారు. అగ్ని, భద్రత ప్రమాదం దృష్ట్యా తొలగించడం జరిగిందన్నారు. న్యాయబద్ధమైన విమర్శలు, పత్రికా పరిశీలనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొన్ని కొన్ని అభ్యంతర పదాలతో వాస్తవాలకు విరుద్ధమైన ఆరోపనలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

## నెక్కొండలో చేపల వ్యర్థాలతో దుర్గందం

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రంలో చేపల అమ్మకాల అనంతరం మిగిలిన చేపల వ్యర్థాలను రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోని గ్రోమోర్స్ సెంటర్ ముందు పడేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మురిగిపోయిన చేపల వలన ఆ ప్రాంతంలో వెళ్లే ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బందితో ఆ వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే నెక్కొండ మండల కేంద్రంలో లక్షల రూపాయల వ్యయంతో ప్రత్యేక చేపల మార్కెట్ నిర్మించినప్పటికీ, అక్కడ వ్యాపారం జరగకపోవడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపేందర్ హాస్పటల్ ముందు, గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో, రైల్వేస్టేషన్ ముందు, రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో చేపల విక్రయాలు నిర్వహిస్తూ వ్యర్థాలను అక్కడికక్కడే పడేయడం వలన దుర్వాసనతో పాటు పారిశుధ్య సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఇది ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల విక్రయాలను ప్రత్యేక మార్కెట్‌కే పరిమితం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా రహదారుల పక్కన వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/కాటారం:** ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.బుధవారం మండలంలోని కొత్తపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల వద్ద తార్పాలిన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని రవాణా సమస్యలు ఎదురైతే వెంటనే సంబందిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.ప్యాడి క్లీనింగ్ పరికరాలు అందుబాటులో లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి వెంటనే తెలిప్పించాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ అశోక్ కుమార్,డిఆర్ఓ వసంత కుమారి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు,సహకార అధికారి వాలియా నాయక్,వ్యవసాయ అధికారుల బాబురావు పాల్గొన్నారు.

## పలువురు మంత్రులకు సరస్వతీ అంత్య పుష్కరాల ఆహ్వాన పత్రికలు అందజేత

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఈ నెల 21 నుండి జూన్ 1 వరకు జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలలో హాజరు కావాల్సిందిగా ఆహ్వానం పలికి హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్,ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావులు మర్యాద పూర్వంగా కలిసి సరస్వతీ అంత్య పుష్కరాల ఆహ్వాన పత్రికలను అందించారు. ఆర్జెసి రామకృష్ణ రావు, కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ మోహన్ శర్మ, ఆలయ ఈఓ మహేష్, ఉప ప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామదేవత బొడ్రాయి ప్రతిష్ట మహూత్సవం

మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండలంలోని వెంగంపేట గ్రామంలో బుధవారం గ్రామదేవత బొడ్రాయి ప్రతిష్టా కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామ పెద్దలు పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమంలో నాల్గొన్నారు. కార్యక్రమంలో గూడూరు మండల బీఆర్ఎస్ నాయకులు జలగం సంపత్‌రావు అరే వీరన్న నూకల సురేందర్ వాంకుడోత్ కలార్‌సింగ్ చిదురు వెంకన్న వల్లెపు శ్రీనువాస్ వేంగంపేట గ్రామ పెద్దలు కుందూరు శోభన్‌రెడ్డి కట్ల విష్ణు బోడ కవిత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం నాలుగో తరగతి ఉద్యోగులు ధర్నా



**ప్రజాపక్షం/ వరంగల్:** తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌హెచ్ఎం నాలుగో తరగతి ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎఫ్‌టియూసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మంగళవారం పిలుపు నిచ్చారు. ఏళ్లుగా సేవలందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు సరైన గౌరవం, ఉద్యోగ భద్రత, సముచిత వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని క్యాడర్ల ఉద్యోగులకు మూడు నెలల నుంచి నాలుగు నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని, ఏజెన్సీ వ్యవస్థ రద్దయ్యే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి నెల 5వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్, మాత శిశువు సంరక్షణ కేంద్రం సెక్యూరిటీ గార్డులు, సపోర్టింగ్ స్టాఫ్ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంటిజెంట్ వర్కర్లు, ఆయుష్ ఎస్ఎన్ఓ తదితర ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం 2021 నుంచి రూ.15,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈఎస్ఐ, పిఎఫ్ చట్టాల ప్రకారం ఉద్యోగుల వాటాలతో పాటు యజమాని వాటాలను సక్రమంగా ప్రతి నెల ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ డబ్బులు ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలని, 2016 సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులను అమలు చేయాలని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్ చేసి బేసిక్ వేతనాలు ఇవ్వాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని కోరారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు అవగాహన



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండలం పెంచికల పేట గ్రామంలో వ్యవసాయ కళాశాల, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ వారి అధ్వర్యంలో వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట శాస్త్రవేత్తలు అనే రైతు అవగాహన కార్యక్రమం గ్రామ పంచాయతీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో. డాక్టర్ ఐ. శకుంతల దేవి , అసిస్టెంట్ ప్రొఫెసర్,మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, పచ్చి రొట్ట ఎరువుల ప్రాధాన్యం, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేయడానికి ఉపయోగించే పరిజ్ఞానాన్ని మరియు పంట మార్పిడి యొక్క ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. కే.గోపిక,వృక్ష వ్యాధి శస్త్రం, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ వివిధ పంటల లో వచ్చే తెగుళ్లు మరియు ఆశించే పురుగులు వాటి నివారణ చర్యలను, వివిధ రకాల జీవ నియంత్రణ కారకాలను వాటిని ఉపయోగించడం వలన పర్యావరణం లో జరిగే మార్పులను గురించి రైతులకు వివరించడం జరిగింది. టి. తిరుపతి వ్యవసాయ విస్తరణ అధికారి మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం మరియు నేల ఆరోగ్యాన్ని కాపాడడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు జనుము, జీలుగా విత్తన లభ్యత మరియు రాష్ట్ర ప్రభుత్వం నుండి లభించే సబ్సిడీలను గురించి ఈ సందర్భంగా రైతులకు వివరించడం జరిగింది. ఈఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ జి . ప్రభావతి ఆయిల్ పామ్ క్రాప్ సబ్సిడీ, మరియు పంట ప్రాముఖ్యత ,దిగుబడుల గూర్చి సంబంధిత రైతులకు వివరించడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పు శైలజ ,ఉప సర్పంచ్ ఎం.అశోక్, మరియు వ్యవసాయ కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థులు ఆర్.ఇందుప్రియా, పి.హర్షిత మరియు 56 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ బిజెపి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

డిసిసి అధ్యక్షుడు బట్టు కర్ణాకర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** నీట్‌యూజీ పరీక్ష పేపర్ లీక్, అవినీతి ఆరోపణలు కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వ వైపల్యానికి నిదర్శనమని డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ తీవ్రంగా విమర్శించారు. ఒక దేశంఒక పరీక్ష అంటూ గొప్పలు చెప్పుకున్న బీజేపీ ప్రభుత్వం, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. నీట్ పరీక్షల సమయంలో విద్యార్థులపై అత్యంత కఠిన నిబంధనలు అమలు చేస్తూ, చెవిపోగులు నుంచి జుట్టు క్లిప్పుల వరకు తనిఖీలు చేసే అధికారులు, అసలు ప్రశ్నపత్రాలనే కాపాడలేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యార్థులపై మాత్రమే అనుమానం చూపించే ఈ ప్రభుత్వం, వ్యవస్థలో ఉన్న అవినీతిపరులపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతోందని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం నీట్ చుట్టూ పేపర్ లీకులు, మార్కుల గందరగోళం, గ్రేస్ మార్కుల వివాదాలు వస్తూనే ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అయినా బీజేపీ ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం లేదని, తప్పు చేసిన అధికారులను కాపాడే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గతంలో రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలు ఉండేవని, కానీ బీజేపీ ప్రభుత్వం బలవంతంగా తీసుకొచ్చిన నీట్ విధానం వల్ల కోచింగ్ మాఫియాలు మాత్రమే లాభపడుతున్నాయని విమర్శించారు. గ్రామీణ, పేద, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎంతటి స్థాయిలో ఉన్నా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

# పేదల అభ్యున్నతికే ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర భూపాలపల్లి రూరల్, అర్బన్, ఘనపూర్ మండలాలకు చెందిన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి అర్బన్ రూరల్ కు చెందిన మొత్తం 46 చెక్కులను రూ.18,45,700 విలువతో ఘనపూర్ మండలానికి చెందిన 31 చెక్కులను రూ.9,74,300 విలువతో పంపిణీ చేశారు. అదేవిధంగా 23వ వార్డుకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కూడా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమం, వైద్య సేవలు, పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. సీఎం ఆర్ ఎఫ్ ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## నేడు సాయిబాబా.. మందిరంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గురువారం హనుమకొండ సాయిబాబా మందిర ప్రాంగణంలో కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఉచిత యూరాలజీ వైద్య శిబిరము నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మతుకు మల్లి హరగోపాల్, మందిర పిఆర్ఓ నిమ్మల శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రముఖ యూరాలజిస్ట్ బి.వి రెడ్డి తదితర సిబ్బంది ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు ఈ శిబిరంలో పాల్గొని అవసరమైన భక్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు సలహాలు ఇస్తారని, భక్తులు ఈ సౌకర్యాన్ని భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## ఆర్యవైశ్యుల ఐక్యతకు గ్రేటర్ మీట్



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** నగరంలో బుధవారం ఆర్యవైశ్యుల ఐక్యతకు ఆర్యవైశ్యుల బిజినెస్ లీడర్స్ గ్రేటర్ మీట్ నిర్వహించారు. వరంగల్ నగరంలో విభిన్న రంగాల్లో కొనసాగుతున్న ఆర్యవైశ్య ప్రముఖులు ఐక్యతగా వృద్ధి చెందే లక్ష్యంతో గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ మీట్ నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలు పరస్పరం సలహాలు, సూచనలు అందించుకున్నారు. గ్రేటర్ చైర్మన్ వోలం ప్రభుకిరణ్, వైస్ చైర్మన్లు బొద్ద రవీంద్రనాథ్, గౌరిశెట్టి ప్రభాకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

**ప్రజాపక్షం/గణపురం:** కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు, బాధిత కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన తిప్పని సారయ్య కుటుంబాన్ని మధుసూదనాచారి పరామర్శించారు. తొలుత సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారయ్య మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురై గాయపడిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కసిరెడ్డి వెంకటరమణారెడ్డిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో బిఆర్ఎస్ నాయకులు బైరగాని కుమారస్వామి, డాక్టర్ జన్నయ్య, రత్నం రవి, తంగెళ్లపెల్లి వెంకట్, వార్డు సభ్యుడు పబ్బ రవి, మహబూబ్ పాషా పాల్గొన్నారు.



# 21 నుండి జూన్ 1వరకు సరస్వతి అంత్య పుష్కరాలు

## పుష్కరాలలో రోజుకో పీఠాధిపతి రాక



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** పన్నెండ్లకొక సారి వచ్చే నదీ పుష్కరాలు ఎంతో విశిష్టత కలిగి ఉంటాయి.పుష్కర కాలంలో నదీమాతల్లి ఒడిలో పుష్కర స్నానం ఆచరిస్తే కోటి జన్మల పాపాలు తొలిగి పోయి పుణ్యఫలం లభిస్తుందని పురాణాల ఇతి వృత్తం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశిగా ప్రసిద్ధి గాంచిన కాళేశ్వరం క్షేత్రంలో ఈ నెల 21నుండి జూన్ 1 వరకు 12 రోజుల పాటు జర గనున్న సరస్వతి అంత్య పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యా చరణ చేపట్టింది. గత ఏడాది నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాల తరహాలో సరస్వతీ అంత్య పుష్కరా లను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని క్షేత్రంలో ఏర్పాట్ల పను లకు రూ.21.98 కోట్ల నిధులు మంజూరు చేసింది. పుష్కర ఏర్పాట్ల పనులపై మంత్రులు శ్రీధర్ బాబు,కొండా సురేఖ,దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అనేక మార్లు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు,వీడియో కాన్ఫరెన్స్ లు ఏర్పా టుచేసి నిర్దీత గడువులోగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో క్షేత్రంలో ఏర్పాట్ల పనులు శరవేగంగా కొనసాగుతు న్నాయి. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం నిత్య పర్యవేక్షణలో రాత్రింబవళ్ళు ఏర్పాట్ల పనులు చకచకా సాగుతున్నాయి.కాళేశ్వరం క్షేత్రంలో ఈ నెల 21న ప్రారంభమై 12 రోజుల పాటు కొనసాగ నున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల పీఠాల నుండి రోజుకో పీఠాధిపతి క్షేత్రాన్ని సందర్శించి త్రివేణి సంగమ తీరంలో పుష్కర స్నానాలు ఆచరించనున్నారు. అదే విధంగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఋత్వికుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం నిత్యం హోమాది క్రతువులు నిర్వహించనున్నారు.సరస్వతి పుష్కరాల సందర్భంగా పుష్కర స్నానాలు ఆచరించే పీఠాధిప తుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 21 న కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి హాజరై సరస్వతీ అంత్య పుష్కరాలను ప్రారంభించి పుష్కర స్నానం ఆచరించనుండగా 22న నాసిక్ పీఠాధిపతి మహా మండలేశ్వర ఆచార్య సంవిదానంద సరస్వతి,24 న శంకరాచార్య మహా స్థానం పీఠాధిపతి శ్రీ అద్వైతానంద భారతి, 25న ఆదిలాబాద్ పీఠాధిపతి శ్రీ యోగానందా సరస్వతి స్వామీజీ, 26న హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి,27న శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం, బర్దీపూర్ పీఠాధిపతి శ్రీ వైరాగ్య శిఖామణి అవదూత మహారాజ్, 28న చింతామణి మఠం, కర్ణా టక పీఠాధిపతి శ్రీ శివానంద భారతి చింతామణి స్వామి, 29న విశాఖపట్నంకు చెందిన శారదాపీఠం పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి,31న మెదక్ జిల్లా కొల్చారం పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి పుష్కర స్నానాలు ఆచరించ నున్నారు. ఆలయంలో నిత్య హోమాలు ఆలయంలో నిత్యం చేపట్టనున్న హోమాల కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 21న మహాగణపతి హోమం, 22న సుబ్రహ్మణ్య షొఢాక్షరి హోమం, 23న హయ గ్రీవ హోమం, 24న నవగ్రహ హోమం, 25న మహా మృత్యుంజయ హోమం, 26న దుర్గ సూక్త హోమం,27న మహా సుదర్శన హోమం,28న మేధ దక్షిణమూర్తి హోమం, 29న స్వయంవర పార్వతి హోమం, 30న ధన్వంతరి హోమం, 31న మహా రుద్ర హోమం,జూన్ 1న లఘు చండీ హోమం మరియు పూర్ణాహుతి నిర్వహించనున్నారు. త్రివేణి సంగమం వద్ద ప్రతి రోజు సాయంత్రం 6:30 నుండి 7:30 వరకు కాశీ పండితుల ఆధ్వర్యంలో నదీ హారతీ,తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయులపై అడ్మిషన్ల ఒత్తిడి ఆపాలి

## ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేస్రం బాస్కర్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపా ధ్యాయులను బోధనకు బదులుగా అడ్మి షన్లు తేవాలని వేధించడం తక్షణమే ఆపా లని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ టీచర్లకు అడ్మిషన్ టార్గెట్లు విధించి, అవి పూర్తి చేయకపోతే ఉద్యోగాల నుండి తొలగిస్తామని, జీతాలు తగ్గిస్తామని యాజ మాన్యాలు బెదిరించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత విద్యార్థు లకు నాణ్యమైన విద్యను అందించడమేనని, వారిపై వాణిజ్య ఒత్తిళ్లు తెచ్చి మార్కెటింగ్ ప్రతినిధులుగా మార్చడం అనైతికమని పేర్కొన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పీఎఫ్ సౌక ర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# గూడూరులో సౌరశక్తి పథకాలపై విస్తృత అవగాహన

## టిజి రెడ్కో జిల్లా మేనేజర్ రాజేందర్

**ప్రజాపక్షం/గూడూరు:** కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పీఎం సూర్యగర్ యోజన మరియు పీఎం కుసుమ్ పథకా లపై గూడూరు గ్రామపంచాయతీ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు గ్రామ సర్పంచ్ సునీత అధ్యక్ష తన జరిగిన ఈకార్యక్రమంలో టీజీ రెడ్కో జిల్లా మేనేజర్ గందం రాజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు రైతు లకు పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇళ్లపై ప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చుసుకుని విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చన్నారు. పీఎం సూర్యగర్ యోజన కింద ప్రభుత్వం భారీ సబ్సిడీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక కిలోవాట్ సోలార్ వ్యవస్థకు రూ 30వేల వరకు రెండు కిలోవాట్లకు రూ ౬0 వేల వరకు మూడు కిలోవాట్లకు రూ 70 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. సౌర్ విద్యుత్ వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విక్రయించి ఆదాయం పోంధే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు.సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే దాదాపు 25 సంవత్సరాల పాటు ఉచిత విద్యుత్ ప్రయోజనం పోందవచ్చని ప్రతి కుటుంబం ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్

సోలార్ ప్లాంట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ పిలుపు నిచ్చారు.ఈసందర్భంగా రైతులు కోసం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ పథకం ద్వారా వ్యవసాయ పోందవచ్చని వివరించారు ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు 3.5 నుంచి 4 భూమి అవసరమవుతుందని సబ్ స్టేషన్ ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉండాలని తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు సుమారు రూ3.5 కోట్ల వ్యయం అవుతుం దని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేసే విధగంఆ చర్యలు చేపడుతోందని రైతులకు రుణ సదుపాయాలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రైతులకు సంవత్సరానికి రూ 50 లక్షలకు పైగా ఆదాయం పోందే అవకాశం ఉందన్నారు. పీఎం కుసుమ్ రెండో విడత మార్గదర్శకాలు విడుదలైన వెంటనే రైతులు దరఖాస్తు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విద్యావికాసానికి సర్పంచ్‌ల సహకారం అవసరం

## గూడూరులో విద్యావారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/గూడూరు:** విద్యాభివృద్ధికి గ్రామపంచా తీల పాత్ర కీలకమని మండల విద్యాశాఖ అధికారి ఆదెపు సుజాత పేర్కొన్నారు.విద్యావారోత్సవాల సందర్భంగా గూడూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సర్పంచులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఉదయం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమే గ్రామస్థాయిలో విద్యా ప్రమాణాల పెంపు ప్రజాప్రతినిధులు చరుకుగా సహకరించాలని కోరారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడుతూ పాఠశా లలు సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తాయని తెలిపారు. గ్రామాల్లో విద్యావంతుల కుటుంబాలు పెరిగితే ఆరోగ్యకరమైన మరియు అభివృద్ధి చెందిన సమాజం ఏర్పాడుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 202627 విద్యా సంవత్సరానికి విద్యా ర్థుల కోసం 22 రకాల నాణ్యమైన వస్తువులతో కూడిన కిట్లు ఆధునిక మౌలిక వసతులు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాల లను మరింత బలోపేతం చేస్తోందని వివరించారు. గూడూరు అయోధ్యపురం మచ్చర్ల గాజులగట్టు మదనాపురం పోనుగోడు రాములతండా తదితర గ్రామపంచాయతీల చెందిన మొత్తం 19 మంది సర్పంచులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్ విద్యాకు సంబంధించిన పది ముఖ్య అంశాలపై సర్పంచులకు సమగ్ర అవగాహన కల్పిం చారు.సర్పంచులపై అధికారులు చిన్న చూపు చూస్తు న్నారని ఏదైనా సమావేశం జరిగితే ఒక రోజు ముందు సమాచారం ఇస్తున్నారే తప్ప దానికి సంబం ధించి వివిధ విధానాలను పాటించకుండా ముందుస్తు సమాచారం లేకుండా అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోని సర్పంచులను సమావేశానికి రమ్మనడం సరైనది కాదని అన్నారు.



# జమ్ముకశ్మీర్‌రోడ్డు ప్రమాదంలో సిఆర్పిఎఫ్ జవాన్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం గ్రామా నికి చెందిన సిఆర్పిఎఫ్ జవాన్ బొమ్మగాని శ్రీనువాస్ జమ్మూకా శ్మీర్లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రవిషాదాన్ని కలిగిం చింది దేశ సేవలో నిబద్ధతతో పనిచేస్తున్న జవాన్ అకాల మరణం కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు స్నేహితులను శోకసంద్రంలో ముంచిందిఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగానే గ్రామంలో విషాదవాతావరణం నెలకొంది పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అమరవీరుడికి కన్నీటి నివాళులు అర్పించారు. జవాన్ పార్థివ దేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిం చారు. పోలీసులు బలగాలు గౌరవవందనం సమర్పించగా ప్రజలు అమర్ జవాన్ అమర్‌హై నివాదాలతో వీడ్కోలు పలికారు.కుటుంబ సభ్యులు రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. ఈసం దర్భంగా మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాజీ ఎంపి మలోత్ కవిత పాలు పలువురు ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు అధికారులు పాల్గొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ దేశ భద్రత కోసం సేవలందిస్తున్న సైనికులు దేశానికి గర్వకారణమని జవాన్ మరణం తాతీరనిలోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా జవాన్ సేవలను స్మరించుకుంటూ ఆయన త్యాగాన్ని కొనియాడారు.

# కొనుగోలు కేంద్రాల నిర్వహకుల నిర్లక్ష్యానికి రైతులు బలి



**ప్రజాపక్షం/నర్సింహులపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వ హకుల నిర్లక్ష్యానికి తాము బలి అవుతున్నామని రైతుల ఆందోళన చేపట్టిన సంఘటన నర్సింహులపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో జరిగింది.రైతులు తెలిపిన వివరాల ప్రకారం..ఆరుగాలం కష్టపడి పండించిన పంటను గత నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తరలించామని ఇంత వరకు కాంటాలు నిర్వహించకుండా కాలయాపనా చేస్తున్నరని ఆందోళన వ్యక్తం చేశారు.సీరియల్ నెంబర్ ప్రకారం కాకుండా కాసులు కుమ్మరించిన పెద్ద పెద్ద రైతుల కాంటాలు నిర్వహిస్తు తమను పట్టించుకోవడం లేద న్నారు.మద్యం,బిర్యానీ ప్యాకెట్లకు అలవాటు పడి తమ ఇష్టనుసారం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రంలో దొంగలు పడి ధాన్యం రాశులపై కప్పిన టార్పిన్ కవర్లు ఎత్తుకెళ్లిన పట్టించుకో వడం లేదని చిన్న రైతులపై చిన్న చూపు చూస్తున్నరని పెద్ద రైతులకు వత్తాసు పలుకుతున్నారని,ధాన్యం కాంటాలు వేయాలంటే బస్తాలను ఆఫీసు నుండి రైతులే తెచ్చుకోవాల్సి వస్తుందని హామలీలు కుడా తమ మాట లెక్కచేయడం లేదని తెలిపారు. కాంటాలు సక్రమంగా జరగాలంటే దాన్యం కొనుగోలు కేంద్రంలోని నిర్వహకులను వెంట నే మార్చలని రైతులు డిమాండ్ చేశారు. వెంకన్న,కాస యాక య్య,జాగాటి రామన్న,నేతవత్ నరేష్,నేతవత్ శంకర్,దూరు నర్స య్య,భూక్య రెడ్యా,అంకం నాగయ్య, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటింటి సర్వే

## తహసీల్దార్ రాజమోహన్

**ప్రజాపక్షం/తలమడుగు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న జనాభా గణన, ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. బుధవారం మండలంలోని దేవపూర్ గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న అధికారు లతో ఆయన మాట్లాడారు. ఎన్యూమరేటర్లు గ్రామ వివరాలు, ఇళ్ల సంఖ్య, జనాభా వంట అంశాలను సేకరించి మ్యాపింగ్ చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధుల సహకా రంతో ప్రతి ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారులను సంప్రదిం చాలని పేర్కొన్నారు.

## శబాష్‌పల్లి శివారులో వ్యక్తి హత్య



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని శబాష్‌పల్లి గ్రామ శివారులో వ్యక్తి హత్యకు గురైన ఘటన మండలంలో చర్చనియాంశమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఘట్కేసర్ మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ అన్వర్ (50) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన జంగారెడ్డి దగ్గర డ్రైవర్‌గా పనులు చేసుకుంటుండేవాడు. ఈ నెల 12న బాల్కొండలో ఉన్న ట్రాక్టర్ తీసుకురావాలని డ్రైవర్ అన్వర్‌కు యజమాని సూచించాడు. దీంతో ట్రాక్టర్ తీసుకొని తిరుగు ప్రయాణంలో మండలంలోని శబాష్‌పల్లి గ్రామ శివారులో శవమై తేలాడు. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు పరిశీలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ మధుకర్‌రెడ్డిలు వెళ్లి పరిశీలించారు. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలు, రక్తపు గాయాలు ఉన్నాయి. మృతుడి భార్య ఫర్జానా తన భర్త మరణంపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## త్వరగా అన్‌లోడ్ చేయించాలి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండలం పరిధిలోని కల్వకుంట గ్రామంలోని శ్రీ సదాశివ రైస్ మిల్లును బుధవారం స్థానిక డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని లారీలు త్వరితగతిన అన్లోడ్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు సెంటర్లలో తూకం వేయడం ఆలస్యం చేయకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా త్వర త్వరగా తూకాలు వేసి ధాన్యాన్ని లారీలకు ఎక్కించే బాధ్యత సెంటర్ల నిర్వహకులకు సూచించారు. ఆమె వెంట రైస్ మిల్ సిబ్బంది రాజిరెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## యువకుడు అదృశ్యం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోమటి రమేష్ (24) అనే యువకుడు గత రెండేళ్లుగా ఏపీలోని పీలేరులో ఓ పౌల్ట్రీలో మేనేజర్‌గా పనిచేస్తుండేవాడు. గత మూడు నెలలగా పనులు మానేసి మేడ్చల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 8న కొంతాన్‌పల్లిలోని ఇంటికి వచ్చాడు. ఈ నెల 11న సాయత్రం 4 గంటల ప్రాంతంలో బయటకు వెళ్తున్నానని చెప్పి రాత్రి 8గంటల ప్రాంతంలో తన అన్న నరేష్‌కు నాకోసం వెతకొద్దని, రెండు రోజులలో తాను చనిపోతున్నానని మెసెజ్ పంపాడు. వెంటనే తన అన్న ఫోన్ చేయగా కలవలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. అన్న కోమటి నరేష్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## బీరప్ప ప్రజలను చల్లగా ఉండాలి

### మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/పాపన్నపేటః** పాపన్నపేట్ల మండల పరిధిలోని గాంధారిపల్లిలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి జాతర మహోత్సవాల్లో మండల నాయకులతో కలిసి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొని బీరప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, బీరప్ప స్వామి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు, పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయని అన్నారు. ఇలాంటి ఉత్సవాలు గ్రామాల్లో భక్తి భావనను పెంపొందించడమే కాకుండా ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జాతరను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. గ్రామ దేవతల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం, భక్తి భావం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలా గౌడ్,పాపన్నపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామ్ రెడ్డి,సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్ మాజీ సర్పంచ్ లు దావుల. శ్రీనాథరావు,లింగారెడ్డి ఏడుకొండలు, స్రవంతి శ్రీనివాస్ గాంధారి పల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విశ్వాస్ రెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు,యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## గిరిజన పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతపూర్ లో 2026–27 విద్యా సంవత్సరానికి 1వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బుధవారం మెదక్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాల ద్వారా మొత్తం 6 మంది విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అందులో 3 మంది బాలురు, 3 మంది బాలికను ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు 01–06–2019 నుండి 31–05–2020 మధ్య జన్మించి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఆసక్తి గల తల్లిదండ్రులు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారంతో పాటు రెండు ఫోటోలు, తహసీల్దార్ ద్వారా ధృవీకరించబడిన కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, విద్యార్థి జనన ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు మించరాదని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను మెదక్ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ రెండో అంతస్తులోని రూమ్ నంబర్ ఎస్17లో ఉన్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు. నింపిన దరఖాస్తులను ఈ నెల 18 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 22న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ విధానంలో డ్రా నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నీలిమ కోరారు.

## అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

### మున్సిపల్ చైర్మెన్ లావణ్య నాగరాజు



**ప్రజాపక్షం/రామాయంపేటః** రామాయంపేట మున్సిపాలిటిలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు తెలిపారు. ఎన్నికల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన 15లక్షల నిదులతో పాటు మున్సిపల్ జనరల్ ఫండ్ 15లక్షల రూపాయలు నిదులు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపెడుతున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ పాలకవర్గం సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. కమిషనర్ గణేష్‌రెడ్డి, మేనేజర్ రఘువరణ్, ఆర్ఐ బాలక్రిష్ణలు కుమ్మక్కై జనరల్ ఫండ్ నుండి రూ.15లక్షలు డ్రా చేయడం చట్ట విరుద్ధమన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈసమావేశంలో వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, దాకి శ్యామల, పుట్టి సందీప్, కోఆప్షన్ సభ్యులు దేమె యాదగిరి, గౌస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## తాలు, తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తే సహించేది లేదు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** తాలు, తరుగు పేరుతో రైతులను దోపిడీకి గురిచేస్తే ఎంతమాత్రం సహించేదిలేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మిల్లర్లను హెచ్చరించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ధాన్యం, మక్కలు కొనుగోలుపై రెవిన్యూ, పౌరసరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్ రవాణ, డిఆర్‌డిఒ, సహకార, పంచాయతీరాజ్, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు ట్రక్ షీట్ ఇవ్వకపోవడం పట్ల రైతుల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 30 రోజులు దాన్యం, మక్కల కొనుగోలులో చాలా ప్రతిష్టాత్మమని ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుందని తెలిపారు. సమావేశాల్లో మాట్లాడుకున్నది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా వేసిన తదుపరి రైతుకి ఏమి సంబంధమని, ట్రక్ షీట్ జారీ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, దాని వల్ల రైతుల ఇబ్బందులకు గురి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు పేరుతో అబద్ధాలు ఆడొద్దని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులతో వరి కోత యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మీ సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం కానీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. రైతులను ఎందుకు ఇబ్బందులు గురి చేస్తున్నారని అని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రవాణాలో ఇబ్బందులు కల్పిస్తే రవాణా కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రవాణాలో ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రమణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, డిఆర్డిఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియా నాయక్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి వరం

### సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్ః** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం నిరుపేద ఆడబిడ్డలకు ఒక వరం లాంటిదని సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజు గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ లు అన్నారు. మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామానికి సంబంధించిన పది కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు అయినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్ లు పాలకవర్గ సభ్యులతో కలిసి పది మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు, పంచాయతీ సెక్రటరీ ప్రియాంక, వీఆర్ఏ వేణు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కోల్పోతున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

### జిల్లా సర్పంచ్ ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్

**ప్రజాపక్షం/కౌడిపల్లిః** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత వంటి సమస్యలు ఉంటే ఎమ్మెల్యేగా ఉన్న సునీత లక్ష్మారెడ్డి అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరించాలని, రాజకీయ లబ్ధి కోసం ధర్నాలు చేపట్టడం సమంజసం కాదని మెదక్ జిల్లా సర్పంచ్ ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సజావుగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి చూపిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ధర్నాలు నిర్వహించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఉన్న సునీతాలక్ష్మారెడ్డి స్వయంగా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి. రైతులు కాని వారితో కలిసి ధర్నాలు చేయడం విచారకరమన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ఎమ్మెల్యే రాజకీయ ధర్నాలతో కాలక్షేపం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేత మల్లికార్జున గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాగుల భూమయ్య పటేల్, ఉబలాషి రమేష్ గౌడ్, దర్జీ రమేష్, కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన గణనలో ప్రజలందరూ పాల్గొనాలి: కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/అల్లాదుర్గంః** జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలో బుధవారం 2027 సంవత్సరంకు సంబంధించిన జన గణనలో తాహాసిల్దార్ మల్లయ్య తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ 1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి సెన్సస్ నిర్వహించబడుతోందని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికి ఇప్పుడు 16వ జన గణన చేపడుతున్నామని తెలిపారు. సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధంగా నిర్వహించబడే ప్రక్రియ అని, ఇందులో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, తరచుగా వినియోగించే ఆహార ధాన్యాలు వంటి అంశాలు నమోదు చేస్తారని మొత్తం 33 ప్రశ్నల ద్వారా గృహ వివరాలు సేకరించి డిజిటల్‌గా భద్రపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు సెంటర్‌ను సందర్శించిన ఎంపిడిఓ



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం రోజున స్థానిక ఎంపీడీఓ రాజిరెడ్డి కొనుగోలు సెంటర్లను ఆకస్మిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు జరగకుండా తూకాలు త్వరితగతిన పూర్తి చేసి అన్లోడింగ్ చేయాలని నిర్వహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సీరియల్ ప్రకారము మ్యాచర్ చూసుకుంటూ తూకాలు వేయించి రైస్ మిల్లర్లకు తరలించాలని తెలిపారు. గ్రామ సర్పంచి పొన్నబోయిన ప్రవీణ్ రైతులు తదితరులు ఉన్నారు.

## కొట్టుకుపోయిన ధాన్యం

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని రాఘవపట్నం గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం రాత్రి కురిసినభారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యపు రాశులు కొట్టుకుపోయాయి కొనుగోలు కోసం తీసుకొచ్చిన వందల క్వింటాళ్ల వరి ధాన్యం తడిసి ముద్దయింది కేంద్రం వద్ద టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికి ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షానికి అవి ఎగిపోయాయి దీంతో రాశులు పోసిన ధాన్యమంతా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది చేతికొచ్చిన పంట నీటి పాలవడంతో రైతులు లబోదిబోమంటున్నారు అమ్ముదామనుకున్న ధాన్యం నష్టపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహాయం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రానికి చెందిన గట్ల వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రదాన కార్యదర్శి జీడి హరీష్, కోశాధికారి ఒర్రె కుమారస్వామి, మృతుని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యను పెంచాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామ స్థాయిలో ప్రతి సర్పంచ్ తమ పాఠశాల ఆవాస ప్రాంతంలోని బడి ఈడు విద్యార్థులందరు 100శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వేదవతి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల సర్పంచ్‌ల అవగాహన సదస్సు మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు అవగాహన పరిచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదును పెంచాలని ప్రభుత్వ పాఠశాలలు మౌలికంగా అనేక వసతులు కలిగి ఉన్నాయని అవసరమైన చోట అందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసులు, కజియారాణి, హెచ్‌ఎంలు శోభారాణి, రమేష్, యాకయ్య, తదితరలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### కలెక్టర్ కె.హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేటః** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిద్ది పేట జిల్లా కల్టెర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు.బుధవారం సిద్దిపేట అర్భన్ మండలంలోని మిట్టపల్లి,నంగునూర్,ముంద్రాయి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని,ఏఎంసీలలో మాత్రమే మక్కల కొనుగోలు సైతం వేగంగా జరుగుతుందని తెలిపారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని లారీలు వచ్చేంత వరకు ఆగకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్ ఇతర వాహనాల్లో ధాన్యాన్ని నింపి మిల్లులకు తరలించాని ఆదేశించారు. అదే విధంగా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని,గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

# పోక్సో బాధితులకు వేగంగా సహాయం

### భరోసా సెంటర్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్‌పి



**ప్రజాపక్షం/మెదక్ :** పోక్సో బాధితులకు వేగంగా సహాయం అందించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలికలకు భరోసా సెంటర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను అదనపు ఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, బాలల పట్ల సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. బాధితుల్లో భయాందోళనలు తొలగించి ధైర్యం కల్పించాలని, ప్రతి కేసులో సకాలంలో న్యాయ, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మానసిక బలం చేకూర్చే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. పోక్సో చట్టాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేధింపులు, అత్యాచారాలు, నిరాదరణకు గురైన మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత, మానసిక ధైర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తున్నామని చెప్పారు. లైంగిక వేధింపులకు గురైన వారు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అదనపు ఎస్‌పి పిలుపునిచ్చారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు కఠినంగా అమలులో ఉన్నాయని, లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడిన వారికి కఠినమైన జైలు శిక్షలు తప్పవని అదనపు ఎస్పీ హెచ్చరించారు. ఈ తనిఖీలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగవద్దు

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/అల్లాదుర్గంః** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మండలంలో గడి పెద్దాపురం గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం తహసిల్దార్ మల్లయ్య ఐకెపి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగులో భూ పరిరక్షణ ముఖ్యం



**ప్రజాపక్షం/మనోహరాబాద్ః** పంట సాగులో మొదటిగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరవరం గ్రామంలో వ్యవసాయ అధికారి సచిన్ ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు పంటల సాగు పై అవగాహన కల్పించారు. ముందుగా నేల ఆరోగ్యంగా ఉంటేనే వ్యవసాయంలో అధిక దిగుబడులు వస్తాయన్నారు. అందుకుగాను భూమి స్వభావం, పోషకాలు, తేమ స్థితి వంటి అంశాలను తెలుసుకోకుండా ఎరువులు వాడడం వల్ల ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి రైతు తన పొలానికి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించుకోవాలని, దాని ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించాలని సూచించారు. అనంతరం సేంద్రియ ఎరువుల వినియోగం, యూరియాను మోతాదుకు మించి వాడకుండా చూసుకోవడం, యూనివర్సిటీ యొక్క మెలకువలను వాడడం, యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ వారి సలహాలు, సూచనలతో పంట సాగు పై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సునీత, ప్రమీల, సర్పంచి దివ్య శ్రీహరి గౌడ్, ఏఈ సచిన్, పాలకవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలల్లో పాల్గొనేవారు పేర్లను నమోదు చేసుకోవాలి

### కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజాపక్షం/ములుగుః** ములుగు జిల్లాలో మే 20 నుండి 22 వరకు నిర్వహించే ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలలో పాల్గొనేందుకు జిల్లా ప్రజలు, కళాకారులు, క్రీడాకారులు, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, ఉత్సవాలపై ప్రజలకు తెలియజేసేలా విస్రృత ప్రచారం కల్పించాలని, సోషల్ మీడియా, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడల విభాగంలో వాలీబాల్, చెస్, క్యారమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో రంగోళి పోటీ, ఫుడ్ స్టాళ్లు, మెహందీ పోటీ, హెయిర్ స్టైల్ పోటీ, టగ్ ఆఫ్ వార్, గిరిజన నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనంలలో పాల్గొనేవారు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ములుగు అభివృద్ధి, ప్లాస్టిక్ రహిత ములుగు, డ్రగ్స్ రహిత ములుగు అనే మూడు అంశాలపై రౌండ్ టేండ్ కాన్ఫరెన్స్ విభాగంలో ఒక టీమ్‌కు 3 మంది చొప్పున, ప్రతి అంశంపై 5 టీమ్‌ల వరకు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రజలు, మహిళలు, కళాకారులు, విద్యార్థులు, క్రీడాకారులు మే 13 నుంచి మే 18, 2026 వరకు ఈడి ఎస్ కార్పొరేషన్ అధికారి ధర్మనాయక్ సెల్ నంబర్ 7032153610 లేదా డివైఎస్ఓ రామ్మోహన్ 7207503775కు ఇన్‌లైన్ విధానంలో వాట్సాప్ ద్వారా తమ వివరాలు పంపించాలని, ఆఫ్‌లైన్ విధానంలో ఈడి ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయం లేదా జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో 18 మే 2026 సాయంత్రం 58గంటలలోపు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## యువత క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలి

### పసర ఎస్‌ఐ తాజుద్దీన్



**ప్రజాపక్షం/–గోవిందరావు–పేట:** పసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోవిందరావు పేట మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో ముగిసిన వాలీబాల్ క్రీడలు ప్రథమ స్థానం రంగాపురం రాగా ద్వితీయ స్థానం ఇప్పలగడ్డ రాగా కన్సోలేషన్ బహుమతులు పొందిన ఫుట్‌పారం గోవిందరావుపేట క్రీడా జట్లను బహుమతులు ప్రధానం చేసిన పసర ఎస్‌ఐ తాజుద్దీన్ ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకెన్ సూచన మేరకు పసర ఎస్‌ఐ తాజుద్దీన్ క్రీడలు నిర్వహించినారు అనంతరం ఎస్‌ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ యువత మద్యం మత్తును వీడి క్రీడల వైపు దృష్టి పెట్టాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని తెలిపారు మండల స్థాయి లో జరిగిన క్రీడల్లో రాణించిన క్రీడాకారులు ములుగు జిల్లాలో జరిగే వాలీబాల్ క్రీడల్లో రాణించి మన జట్టు ప్రథమ స్థానంలో నిలవాలని తెలిపారు క్రీడాకారులకు మంచి భోజన వసతి ఏర్పాటు చేశారు ఆదినారాయణ శ్రీనివాస్ కృష్ణ మెమొంటోలు అందజేశారు.

## పెట్రోల్ పోసుకుని యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** అప్పుల బాధతో పెట్రోల్ పోసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం శివారు వడ్డేగూడెం గ్రామానికి కుక్కల రాజేందర్ (32) అప్పుల బాధతో మృతిచెందాడన్నారు. కుక్కల రాజేందర్ అనే వ్యక్తి ట్రాక్టర్ నడుపుకుంటూ, వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. కొన్నేళ్ల క్రితం బ్యాంక్ లోన్ రూ.10లక్షలు తీసుకుని ఇల్లు కట్టుకున్నాడని, సంవత్సరంన్నర కింద ట్రాక్టర్ లోన్ తీసుకున్నాడని అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందన్నారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నాడన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చర్యలు

## జిల్లాలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



**ప్రజాపక్షం / జనగామ :** ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగొద్దని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. బుధవారం జనగామ జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ సుడిగాలి పర్యటన చేసి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. లింగాలఘనపురం మండలంలోని కుందారం, దేవరుప్పుల మండలంలోని కో లుకొండ, పాలకుర్తి మండలంలోని ఈరవెన్ను, అయ్యంగారిపల్లి, గూడురు, స్టేషన్‌ఘనపూర్ మండలంలోని శివునిపల్లి గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి ఎలాంటి ఆ లస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి అన్‌లోడింగ్ ప్ర క్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేం ద్రాల్లో రైతులకు ఇబ్బందుల తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం తూకం, నాణ్యత పారదర్శకంగా ఉండాలన, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యం నిలువ, రవాణా ప్రక్రియను వేగవంతం చేసి ఎక్కడా నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ధాన్యం బస్తాల దిగుమతిలో మిల్లుల వద్ద ఒకరు తప్పక బాధ్యత తీసుకోవాలని, కొనుగోళ్లకు సంబంధించన ప్రతి రిజిస్టర్, ట్రక్‌షీట్ పక్కాగా నిర్వయించాలన్నారు. కొ నుగోలు అయిన ధాన్యం వివరాలు ఎప్పటికి అప్పుడు ఓపెంఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ గా ఉన్నందున రైతులు, కేంద్ర నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎపిఎంలు, సిసిలు కేంద్ర నిర్వాహకులు సమన్వయంలో పని చేయాలన్నారు. రైతులు గం టల తరబడి వేచి ఉండకుండా ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్‌చేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి నిర్లక్ష్యం, ఆలస్యం చోటు చేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నా ణ్యత పేరుతో రైతులకు బ్బందులు గురి చేస్తే ఊరుకునేద లేదన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా ఉంటుందని, రై తులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. కుందారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు.

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి**

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులలో సమీక్ష నిర్వహించారు. గన్నీ బ్యాగ్‌ల నిల్వలు, హమాలీల అందుబాటు గోదాముల సామర్థ్యం, రవాణా, మార్క్‌ఫెడ్ వంటి అంశాలను అడిగి తెలసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు సరిపడా గన్నీ బ్యాగ్‌లు చేరేలా చర్యలు తీసుకోవాలని, పంట అధికంగా వచ్చే కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ కొనుగోలు ప్రక్రియకు ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా జరిగేలా చూడాలన్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. రవాణా, గోదాముల నిర్వాహణపై ప్రత్యేక దృ ష్టి సారించాలని, కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ భాస్కర్, మార్క్‌ఫెడ్ డిఎం చంద్రశేఖర్, ఆత్మ డిపిడి విజయశ్రీ, డిసిఓ కోదండరాములు, డిఎంఓ రామకృష్ణ, అదనపు డిఆర్‌డిఓ నూరుద్దీన్, ఎఎంవి శ్వేత పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని నక్షత్ర గార్డెన్‌లో పెద్దమడూర్ గ్రామానికి చెందిన పోచంపల్లి కొండయ్య కూతూరి వివాహానికి, సింగరాజుపల్లి గ్రామంలో గల తుమ్మ గార్డెన్‌లో చింత చంద్రయ్య కూతూరు వివాహానికి, ఇతర వివాహాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట జిల్లా బీఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్, చింత రవి, నాయకులు మల్లేష్, సుందర్, సోమనర్సయ్య, కృష్ణమూరి హన్మంత్, పరుశరాములు, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/తాడ్వాయిః** మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన దాయ వెంకటేశ్వర్లు కుమార్తె వివాహం మణుగూరు లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయగా వివాహానికి తాడ్వాయి మండల కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్, సహకాక సంఘం మాజీ చైర్మన్లు పులి సంపత్ గౌడ్, పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండి ముజఫర్, మాజీ ఎంపిటిసి ఇర్పవడ్ల భవాని నారాయణ, మాజీ సర్పంచ్ మంకుడి నరసింహస్వామి, మల్లూరు లక్ష్మీ నరసింహ ఆలయ డైరెక్టర్ పల్నాటి సత్యం, గంగారం సర్పంచ్ బడే రాంబాబు, మండల నాయకులు వంగరి సదానందం, అనుమాండ్ల రాజీరెడ్డి, ఆలేటి జైపాల్ రెడ్డి, వీరచారి, దాసరి శివానంద్, ఆలెం సాంబశివరావు, సింగిల్ విండో డైరెక్టర్ కాయితి లింగాచారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుండా పనులు చేయనివ్వం

# రోడ్డు విస్తరణ పనులను అడ్డుకున్న పోతారం రైతులు

## హామీ ఇచ్చిన రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు



**ప్రజాపక్షం/ముత్తారం :** తమకు రావాల్సిన నష్టపరిహారం చెల్లించకుండా వ్యవసాయ భూముల్లో రోడ్డు విస్తరణ పనులు చేయడానికి వీల్లేదని భూనిర్వాసిత రైతులు తెగేసి చెప్పారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం, ఓడేడ్ గ్రామంలో బుధవారం నేషనల్ హైవే (ఎన్‌హెచ్) రోడ్డు విస్తరణ పనులను రైతులు అడ్డుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించిన సమస్యలపై తాము పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుండా, పరిహారం ఇవ్వకుండా ఇప్పుడు నేరుగా సాగు భూముల్లోకి వచ్చి పనులు ప్రారంభించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.రైతులకు న్యాయం చేయకుండా పనులు ముందుకు సాగిస్తే.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అడ్డుకుంటామని అధికారులను హెచ్చరించారు.రైతుల ఆందోళనతో ఉద్రిక్తత నెలకొనడంతో సమాచారం అందుకున్న రెవెన్యూ,పోలీసు, ఎన్‌హెచ్ అధికారులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతుల అభ్యంతరాలను, డిమాండ్లను సావధానంగా విన్నారు. నిర్వాసితుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.అధికారుల హామీతో రైతులు తాత్కాలికంగా శాంతించడంతో పరిస్థితి సద్దుమణిగింది.అయితే, వెంటనే పెండింగ్ పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని,లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు స్పష్టం చేశారు.

# ప్రజాసేవే లక్ష్యం అంటున్న సర్పంచ్



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన సర్పంచ్ కోదూరి స్వర్ణలత శివకుమార్ గౌడ్ ప్రతి రోజు అనునిత్యం గ్రామసేవలో నిమగ్నమై ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని వారికి కావాల్సినపుడు అందుబాటులో ఉండి గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాడని గ్రామస్థులు సర్పంచ్‌ని కొనియాడారు. గ్రామంలోని మురికి కాలువలు, వీధులు శుభ్రం చేయడంలో, రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను కానీ ఎప్పటికపుడు తొలగిస్తూ, సిబ్బందితో మురికి కాల్వలను, వీధులను శుభ్రం చేయించడం, వీధి లైట్లను అమర్చడం గ్రామ పంచాయితి సిబ్బందితో చేయడంలో ఆయన ముందున్నాడని గ్రామస్థులు సర్పంచ్‌ని కొనియాడారు.

# సాఫీగా ధాన్యం కొనుగోలు పూర్తి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండల కేంద్రంలోని మిత్ర మిల్లుని జెసి బెన్షాలోమ్ సందర్శించి ఆన్‌లోడింగ్ ప్రక్రియని వేగవంతం అయ్యేందుకు సరిపడా హమాలీలను పెట్టుకోవాలని మిల్ యజమానులను జెసి ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని చిన్న రామన్‌చర్లలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు రాకుండా సాఫీగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత సర్పంచ్‌లదే

## జిల్లా కలెక్టర్ బి హేమంత్




**ప్రజాపక్షం/ములుగుః** తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అనుసరించి విద్యా వారోత్సవాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామ సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లకు పాఠశాల విద్యాశాఖ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్దార్థ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా ములుగు కలెక్టర్ బి. హేమంత్‌తో పాటుగా ఆత్మీయ అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి, ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచ్‌లు, కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలతో మమేకం అయ్యే క్షేత్రస్థాయి ప్రజా ప్రతినిధులు మీరేనని కాబట్టి మీ గ్రామంలోని ప్రభుత్వ శాఖల పనితీరును పర్యవేక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి మీ వంతు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచుటకు సహకరించాలని వారు అన్నారు. కలెక్టర్ తాను తాను రానున్న రోజుల్లో ప్రతి గ్రామం సందర్శిస్తానని గ్రామ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క సహకారంతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని మంత్రి గత విద్యా సంవత్సరం ఎంపిక చేసిన పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారని, భవన నిర్మాణ అనుమతి లేక చదువుకు దూరం అవుతున్నటువంటి గొత్తి కోయ గూడాలు అయినటువంటి బంగారుపల్లి, గుర్రాల బావి గ్రామాలలో కంటైనర్ పాఠశాలలను మంత్రి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్దార్థ రెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు బి. శ్యామ్ సుందర్ రెడ్డి, జి. సాంబయ్య, బి.రజిత, ఉల్లాస్, కోఆర్డినేటర్ పీర్ల కృష్ణ బాబు, ఎసిజిఇ వినోద్ కుమార్‌తో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మండల విద్యాశాఖ అధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

# టాటా ఎఐజి ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ




**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ః** రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించి సురక్షితంగా వారి గమ్యస్థానాలను చేరుకోవాలని టాటా ఏఐజి రీజినల్ హెడ్ వివేకానంద తెలిపారు. బుధవారం టాటా ఏఐజి హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆర్ అండ్ బి సర్కిల్ నుంచి ప్రతిమ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి,రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రీజినల్ హెడ్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు రహదారులపై రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలన్నారు. నియమాలను పాటించకపోవడం,అజాగ్రత్తగా డ్రైవ్ చేయడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాహన చోదకులు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలను కోల్పోవడం మేగాక వారిపై ఆధారపడిన కుటుంబాలను అనాథలు చేసి కోలుకోలేని స్థితికి కారణమవుతున్నారన్నారు. కరీంనగర్ సీనియర్ ఏరియా మేనేజర్ సంధ్య, రాజకుమార్ లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్, 4వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారి వాహనాలకు ఇన్సూరెన్స్ తోపాటు ఆరోగ్య బీమా, జీవిత బీమా కలిగి ఉండాలని కోరారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఇన్సూరెన్స్ కలిగివుంటే ఆర్థిక భద్రత చేకూరుతుందని సూచించారు. రోడ్డు నియమాలు పాటించకుండా ప్రమాదలకు గురైతే ఇన్సూరెన్స్ ఉన్నా క్లెయిమ్ ఇవ్వరని తప్పనిసరిగా నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, సీనియర్ సీఎస్ఎం నగేష్, సతీష్, మహేందర్, ప్రొద్యూసర్లు, మెంటార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీడీ ఆకు సేకరణదారులు అప్రమత్తంగా ఉండాలి



ఎపిడిఒ అప్పయ్య

**ప్రజాపక్షం/సిర్పూర్ టీ :** బీడీ ఆకు సేకరించే టప్పుడు,సేకరణదారులు వన్యప్రాణుల నుండి రక్షణ కోసం గుంపులుగా వెళ్ళాలని, చప్పుడు చేస్తూ లేదా మాట్లాడుకుంటూ ఆకులు కోయాలని ఎఫ్డిఓ అప్పయ్య తెలిపారు.పులి సంచరించే ప్రాంతాలైన ఇటుకల పహాడ్, చీలపల్లి,మాలిని పరిసర ప్రాంతాల వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సిర్పూర్ రేంజ్‌లోని పలు బీడీ ఆకు కల్లాలను పరిశీలించి, సేకరణదారులకు మరి యు కల్లా ఇంచార్జ్‌లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, సెక్షన్ ఆఫీసర్లు అతారుద్దీన్, మోహన్ రావు, బీట్ ఆఫీసర్లు లక్ష్మీ, షాహిద్, రవీనా పాల్గొన్నారు.

## ఆటో అతివేగం కారణంగా అదుపు తప్పి బోల్తా

### 9 మందికి గాయాలు, ఒకరి మృతి

**ప్రజాపక్షం/భైంసా :** మండలంలోని మాటేగాం సమీపంలో ఒక ఆటో అతివేగం కారణంగా అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఆ ఆటోలో మొత్తం 9 మంది ప్రయాణికులు నిర్మల్‌లో జరిగిన ఒక ఫంక్షన్‌కు వెళ్ళి తిరిగి భైంసాకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారందరిని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు ఒక వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్‌తో పాటు మరో 5 మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరూ భైంసాకు చెందిన వారే, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గోవుల అక్రమ రవాణాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/తానూర్ :** బక్రీద్ సందర్భంగా గోవులు, దూడలు, ఆంబోతులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఉత్తమ జాతి పశువుల అక్రమ రవాణా, జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం తానూర్ ఎస్.ఐ. శేక్ జుబేర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ యూత్ సభ్యులు ప్రసాద్, చంద్రకాంత్, మాట్లాడుతూ, గోమాత వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమని వారు పేర్కొన్నారు. గావో విశ్వస్య మాతర, అనే వేద వాక్యాన్ని ఉల్లంఘిస్తూ గోరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మండలంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ గోసేవా విభాగం, తదితరులు ఉన్నారు.

## మ్యాట్రిమోనీ మోసం.. మహిళ గోల్డ్ చైన్‌తో పరార్



**ప్రజాపక్షం/హాజీపూర్ :** హాజీపూర్ మండలంలో మ్యాట్రిమోనీ సైట్ ద్వారా పరిచయమైన మహిళను నమ్మించి ఆమె గోల్డ్ చైన్ దోచుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, ఘటనలో ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం చెందిన రజిత అనే మహిళ మే 1వ తేదీన తన మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీకి గురైందని ఫిర్యాదు చేసింది.ఈ కేసును విచారించిన పోలీసులు ప్రకాశం జిల్లా వల్లపల్లి గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు.దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం నిందితుడు మ్యాట్రిమోనీ వెబ్ సైట్ అయిన Shaadi.com ద్వారా రజిత ప్రొఫైల్‌ను లైక్ చేసి పరిచయం పెంచుకున్నాడని,తాను హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెప్పి మహిళ నమ్మకం పొందాడు.పెళ్లి సంబంధం పేరుతో తరచూ మాట్లాడి ఆమెతో సన్నిహితంగా మెలిగినట్లు పోలీసులు తెలిపారు.ఏప్రిల్ నెలలో ఒకసారి కారులో వచ్చి ఆమెను కలిసిన నిందితుడు, అనంతరం మే 1వ తేదీన బైక్‌పై కర్ణమామిడి గ్రామానికి చేరుకున్నాడని, "నగలు చేయించాలి"అని చెప్పి మహిళను మంచిర్యాలకు తీసుకెళ్లాడని, అక్కడి నుండి తిరిగి వస్తున్న సమయంలో సాయంత్రం సుమారు 6:30 గంటల ప్రాంతంలో గుడిపేట గ్రామ శివారులో బంగారు గొలుసు మోడల్ చూడాలని అడిగి ఆమె మెడలోని చైన్ తీసుకున్నాడని, అనంతరం మహిళను బైక్‌పై నుంచి కిందకు నెట్టేసి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల విచారణలో నిందితుడి గత చరిత్ర కూడా బయటపడింది. 2013లో బైక్ దొంగతనాల కేసుల్లో అతనిపై కేసులు నమోదైనట్లు తెలిసింది. గతంలో బండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీదేవి అనే మహిళను మోసం చేసిన కేసులో కూడా అతను జైలుకు వెళ్లినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.ఫేక్ ప్రొఫైల్స్,తప్పుడు ఉద్యోగ వివరాలు చెప్పి మోసాలకు పాల్పడే వ్యక్తులు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి అని తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనానికి సర్పంచ్ బ్రేక్



**ప్రజాపక్షం/చెన్నూరు :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులకు సోమనపల్లి గ్రామపంచాయతీ నుంచి అవసరమైన తీర్మాన ప్రతిని ఇవ్వకుండా సర్పంచ్ తోకల మల్లేష్ కావాలనే జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.కోట్ల రూపాయల నిధులతో గ్రామీణ పేద విద్యార్థుల భవిష్యత్తును మార్చే ఈ విద్యా ప్రాజెక్ట్, సర్పంచ్ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. పేద, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి రాజకీయ అహంకారమే అడ్డుగోడగా మారిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామాభివృద్ధి కంటే వ్యక్తిగత వైఖరి ముఖ్యమా? అసలు అంటేనే ఈయనకు ఇష్టం ఉండదా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,మంగళవారం సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, స్పందించకపోతే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 సెక్షన్ 37(5) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తో రాజకీయాలు ఆడితే ప్రజలు క్షమించరని గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.కోట్ల రూపాయల విద్యా ప్రాజెక్ట్‌ను వ్యక్తిగత అహంకారానికి బలి చేయొద్దని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## సింగరేణి పాఠశాలల్లో డ్రాయింగ్ పోస్టులు భర్తీ చేయాలి



**ప్రజాపక్షం /మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి హైస్కూల్‌లో ఇప్పటివరకు ఆర్ట్ & డ్రాయింగ్ ఉపాధ్యాయ పోస్టు మంజూరు కాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల సృజనాత్మక అభివృద్ధికి కీలకమైన డ్రా యింగ్, సంగీత బోధనను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని వారు అభిప్రాయపడుతున్నారు.ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించగా,సింగరేణి యాజమాన్యం నుంచి ఇప్పటివరకు డ్రాయింగ్ పోస్టు మంజూరు కాలేదని తెలిపారు. పోస్టు మంజూరు అయితే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయ న పేర్కొన్నారు.అదేవిధంగా డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్‌ను సంప్రదించగా,కొత్తగూడెం సింగరేణి ఎడ్యుకేషనల్ జీఎంతో చర్చించి త్వరలోనే కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా మందమర్రి సింగరేణి హైస్కూల్‌కు ఆర్ట్ & డ్రాయింగ్ టీచర్‌ను నియమించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి హైస్కూల్‌లో డ్రాయింగ్, మ్యూజిక్ వంటి సృజనాత్మక విభాగాలకు ఉపాధ్యాయులు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ నిబంధనలు అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పాఠ్యాంశాలతో పాటు ఆటలు, పాటలు, చిత్రలేఖనం వంటి అంశాలు విద్యార్థుల మానసిక వికాసానికి, ఆత్మవిశ్వాసానికి దోహదపడతాయని వారు పేర్కొన్నారు.చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని, భవిష్యత్తులో ఉన్నత అవకాశాలకు కూడా ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కనీసం ఈ విద్యా సంవత్సరానికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి, అన్ని సింగరేణి పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా డ్రాయింగ్ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థులు,తల్లిదండ్రులు,కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

## కౌటాల ప్రాంతంలోని పశువుల విక్రయశాల పరిశీలన

**కౌటాల పశువుల విక్రయశాల, పెద్దబండ చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్**



**ప్రజాపక్షం/సిర్పూర్ టీ :** జిల్లా ఎస్పీ నితిక పంత్ గారు ఈరోజు కౌటాల ప్రాంతంలోని పశువుల విక్రయశాలను పరిశీలించి అక్కడి నిర్వాహకులు మరియు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పశువులకు సరిపడా నీరు, దాణా, గడ్డి అందించేలా చర్యలు తీసుకోవాలని,వాటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అలాగే ఆవుల కొనుగోలు, అమ్మకాలు సంతలలో నిషేధమని స్పష్టం చేశారు. పశువుల రవాణా, విక్రయాలకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం సిర్పూర్ టి మండలంలోని పెద్దబండ చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ గారు అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు అందించారు. చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సరైన ధ్రువపత్రా లు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌటాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కు మార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణ జీవీఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన నియోజక వర్గ ప్రజా ప్రతినిధుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఖానాపూర్ ఎం.ఎల్.ఏ. వెడ్మ బొజ్జు పటేల్, ఎం.ఎల్.ఏ. మాట్లాడుతూ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యా వ్యవస్థ పైన సర్పంచులకు, మున్సిపల్ ప్రజా ప్రతినిధులకు అవగాహన కోసమే ఈ కార్యక్రమ నిర్వహణ ఉద్దేశం అని ప్రజా ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి కొరకు మహాజనా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా విద్యార్థులకు అన్ని వసతులు కల్పించమని రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సమానమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. త్వరలోనే ఖానాపూర్ కేంద్రంగా తెలంగాణ మోడల్ స్కూలు ఏర్పాటు చేస్తా, ఏటిసి సెంటర్ ఏర్పాటు, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం అన్నారు. అవగాహన కార్యక్రమానికి హాజరైన సర్పంచులకు గ్రామ అభివృద్ధి కొరకు కలెక్టర్‌తో మాట్లాడి 5 లక్షల రూపాయలు అధనంగా మంజూరు చేస్తామని ప్రజా ప్రతినిధులు రానున్న విద్యా సంవత్సరంలో అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కొరకు చేస్తున్న కార్యక్రమాలను గ్రామాల్లో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎం.ఆర్.ఓ. సుజాత, ఎంపిడిఓ రాధ, ఎం.ఇ.ఓ. సంధ్యారాణి, మున్సిపల్ కమీషనర్, సుందర్ సింగ్, మున్సిపల్ చైర్మెన్ అంకం మౌనిక, అధికారులు, సర్పంచ్‌లు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అన్నదాత అరిగోస

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును పరిశీలించిన ఎం.ఎల్.ఏ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అరిగోసలు పడుతున్నారని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అన్నదాతలు బలవుతున్నారని, అన్నారు. నేడు సారంగాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు పరిశీలించారు. మార్కెట్ యార్డులో ఎక్కడికక్కడ కుప్పలుగా పడి ఉన్న మొక్కజొన్నను చూసి అధికారులను నిలదీశారు. కొనుగోలుకు సంబంధించి ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలని సూచించారు. రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొక్కజొన్న పంట పూర్తి స్థాయిలో కొనుగోలు కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు కళ్ళాలకు వస్తుంది. అకాల వర్షాలు సంభవిస్తాయని ఒక వైపు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు గన్నీ బ్యాగులు, లారీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించి ఏర్పాట్లను చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రైతు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు , కార్యకర్తలు, గ్రామ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** మండలానికి చెందిన 208 లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముభారక్ చెక్కులను మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బిజెఎల్పీ నేత ఎం.ఎల్.ఏ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. పెళ్ళైన ఆడబిడ్డలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామంటూ బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు, రైతులు రైతు కూలీలు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అందరినీ మోసం చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేష్, మండల బిజెపి సీనియర్ నాయకులు, గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.